🕉 ఓం శ్రీ మాత్రై నమః🕉

"శ్రీ నిమిషాంబికా దేవి శతకము" పుస్తక రాజములోని తదుపరి భాగంగా పైన పెట్టిన పోస్టులను ఒక్కసారి గమనించగలరు. అవియే మన కులదైవమైన మాత శ్రీ నిమిషాంబికా దేవి అష్టోత్తర శతనామ స్తోత్రము మరియు అష్టోత్తర శతనామావళి. ఈ రెంటిని రచించిన వారు మా పిత్రుదేవులైన పూజ్యులు **పండిత శ్రీ ఇనుగండ్ల వెంకటేశ్వర వర్మ గారు.**

దేవి కరుణ కటాక్షముల ద్వారా అమ్మవారి చరిత్రపై ఎన్నో పురాణేతిహాస గ్రంథములను క్షుణ్ణంగా చదివి ఆకలింపు చేసుకొని గొప్ప గొప్ప సంస్కృత, ఆంధ్ర ఉభయభాషా పండితులతో చర్చలు జరిపిన పిమ్మట అట్టి సంస్కృతంలోని పద్దెనిమిది పురాణములుగా ప్రసిద్ధిగాంచిన **శ్రీ బ్రహ్మాండ పురాణము లోని వర్ణ వైభవ ఖాండము** నందలి **శ్రీ ముక్త** ఋషి చరిత్ర అను నామధేయముతో కలిగిన మన శ్రీ సోమవంశ ఆర్య క్షత్రియ కులదైవమైన శ్రీ నిమిషాంబికా దేవి చరితము, ఆవిర్భావము మరియు మన పుట్టు పూర్వోత్తరములకు మూలమైన **శ్రీ ముక్త ఋషి చరితము** అమ్మవారి అష్టోత్తర శతనామావళి, అష్టోత్తర శతనామ స్తోత్రము వంటి ఎన్నో రచనలను గావించి ముందు తరాలకు అందించగలిగారని చెప్పడానికి మరియు అతని ద్వితీయ పుత్రునిగా జన్మించి నందుకు చదువుల తల్లి, సాహిత్యచన్య విరాజిత యైన **శ్రీ శారదా సరస్వతీ కటాక్షం** తో నాకు కూడా తెలుగు చందస్సులో కొద్దిపాటి జ్ఞానం ఉండి అమ్మవారిపై ఇలా శతకమును పూర్తిచేసి నందులకు ఎంతగానో ఆనందిస్తున్నాను మరియు గర్వపడుతున్నాను.

అమ్మవారి ప్రస్తుతితో ప్రారంభమైన ఈ శతక రాజములోని 108 పద్యములు రేపటి నుండి తప్పక మీ ముందర వరుసగా క్రమ పద్ధతిలో ఉంచడానికి ప్రయత్నిస్తాను. సాదరణతో సంయమనం పాటించి, ఏదేని కారణాలవల్ల పోస్టులు ఆలస్యమైన కూడా అన్యదా భావించక నన్ను తప్పుపట్టక తప్పకుండా క్షమిస్తారని విన్నవించు కుంటున్నాను.
💖సదా ప్రేమతో...
మీ "కళాధర్" 🙏

శ్రీ విఘ్నేశ్వరాయై నమః
శ్రీ నిమిషాంబికాయై నమః

శ్రీ నిమిషాంబికా దేవి శతకము

తండ్రి స్ఫూర్తితోడ తలపెట్టి వ్రాసితిన్
నిమిషదేవి శతక మీకృతియును
అతని పాదములకె నర్పించుచుంటిని
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) 1

మకుటమతని పదమె మనసారా గ్రహియించి
ఆటవెలదిలోన మాటలుంచి
వాణి దీవేనంది వ్రాసితీ శతకంబు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) 2

వేంకటేశ్వరుండు ఇనుగండ్ల వంశంపు
కీర్తిచంద్రికలను పెంచనెంతొ
జన్మ ధన్యమాయె జనియించ సుతుడనై
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) 3

https://docs.google.com/document/d/1h83SrPwrNnVRFFaPnnwQ3ENRQuILwf5OOGLJdMeRNeo/edit

శ్రీ నిమిషాంబికా దేవి శతకము

ఆది విష్ణురాజుకర్పించి తొలిపూజ
ఇంటివేల్పు వెంకటేశు గొల్చి
నతము నీకు జేసి శతకంబు వ్రాసితిని
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) 4

ముగ్గురమ్మలకును మూలంపుటమ్మయౌ
ఆది శక్తి రూపిణంబ వీవు
సోమక్షత్రియులకు ప్రేమిలవేల్పీవు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) 5

తల్లి తులసిదేవి తండ్రి తానినుగండ్ల
వేంకటేశ్వరాఖ్యుడింక గురువు
మాతపితరులు దివినాశీర్వదించగన్
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) 6

తల్లిదండ్రులవని ప్రత్యక్ష దైవాలు
వారి మించి వసుధ వేరు లేరు
వారి జూడకున్న వ్యర్థమే జీవంబు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) 7

శ్రీ నిమిషాంబికా దేవి శతకము

జనని, జన్మభూమి స్వర్గంబునకు మిన్న
వాని మరచు బ్రతుకు వ్యర్థమన్న
ఒసగ నేమియైన ఋణము తీరదు కన్న
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) 8

పరమశివుడు లింగడభిషేక ప్రియుడైన
అరయ స్తోత్ర ప్రియుడు ఆంజనేయు
డలర శ్రీహరి నలంకార ప్రియుడుగా
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) 9

కాయమతనిభిక్ష, పాండిత్య మతనిదే
వాస గ్రాస మెల్ల వారి భిక్షె
తల్లిదండ్రి పేరు తరగకుండగ తిరుగు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) 10

పాప పుణ్య మిలను శాశ్వతంబై నిల్చు
కూడబెట్ట ధనము తోడు రాదు
చేసినంత నీవు మోసిపోవలెనుగా
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) 11

నాది నాది యనుచు స్వార్థబుద్ధిని కలిగి
కోట్లు కూడ బెట్ట కోర్కెలణచ
కాసు యైన రాదు కాటికిన్ నీ తోడు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **12**

వేద శాస్త్రములను వేవేలు చదివినా
వినయముండకున్న విలువ సున్న
చదువు లెన్ని ఉన్న సంస్కారమే మిన్న
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **13**

వాయసంబురీతి వందేళ్ళ కంటెను
కోయిలౌచు బ్రతుకు కొన్ని నాళ్ళు
పరులు మెచ్చు రీతి చరియించుటే ఖ్యాతి
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **14**

తల్లిదండ్రులు మాయ తన సోదరులు మాయ
ఆలుబిడ్డలు మాయ నంత మాయె
కంటిచూపుకెంత నగుపించు నది మాయ
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **15**

ఏ పనైన నీవు చేయబూనిన గాని
సర్వ జనుల జెప్పి సలహలంది
నచ్చు నటుల నీకు నడుచుకొనుట మేలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **16**

ఉప్పు లేను కూర చప్పగా రుచి కాదు
చెప్పు లేని నడక మెప్పు కాదు
తప్పు జేయు మనిషి ముప్పు పొందు నిజము
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **17**

తిరుగు నాతి చెడును ఇలు పిలల నొగి
ఇంట నుండ చెడును ఇల మగాడు
ఎవరి యునికి వారు నెరిగి మెసల మేలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **18**

కలికి కంట నీరు దారిద్ర్యమున ముంచు
ఇంతి మురియ నింట సిరులు హెచ్చు
స్త్రీల గొల్చు చోట దేవతల్ నివసించు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **19**

వస్తువందు లేదు ఆనందము కనగ
మనసునందె కలదు మది నెఱుంగు
తృప్తి మించినాస్తి తరచి చూడగ లేదు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **20**

గురుతు నెఱిగి నీవు గురిపెట్టి లక్ష్యంబు
నెంతొ పట్టుదలను పంతమిడక
సాధనంబు తోడ సమకూర్చు కొనవచ్చు
నిశ్చయంబుగాను నిముషదేవి

(1 Jul 2010) **21**

పసిడి పళ్ళెమందు పాపిష్టి ధనముతో
పంచభక్ష్యముల భుజించు కన్న
కష్ట పడ్డ ముంత గంజి కూడె మిన్న
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **22**

పరువు మనిషి యునికి పరువే ప్రతిష్టయున్
పరువు పోయెనేని తిరిగి రాదు
పరువు కొరకు బ్రతుకు మనిషే మహాత్ముడౌ
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **23**

పుట్ట వెంట రాదు పోగైన నీ తోడ
గిట్ట రాదు వెంట పట్టెడైన
ఒట్టి చేత రాక ఒంటరే నీ పోక
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **24**

అనుభవాలబుట్టె నాచార మనుమాట
పెద్దలన్న మాట చద్ది మూట
వాటి గౌరవించ మేటిదౌ నీ బాట
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **25**

ప్రాకులాడ రాదు ప్రాయాస పడుచుండి
ప్రాప్త మున్న వాని పాలె జేరు
నుదుటి రాత మార్చ నుర్విలో జరిగేన?
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **26**

మనిషి విలువ దెలియు మహిలోన పరికింప
ధనము గాదు వాని గుణము చేత
మనసు మలినమైన మనుగడే ముప్పగున్
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jul 2010) **27**

కలిమి గలుగ బంధుగణమంత దరిజేరి
నుండ రారు లేమి నండ నొకరు
బెల్లమున్న చోటు నీగలుండునటుల
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **28**

వంద బిందె నీళ్ళు తొందరతోబోయ
ఋతువు రాక పండ్లు వృక్షమిడునె?
కార్యమవును జగతి కాలానుగుణమున
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **29**

అవసరంబు నండు ఆలంబనైనిల్చు
స్నేహితుండె అసలు నేస్తుడన్న
కష్ట కాలమందు కలిసుండు లేమినన్
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **30**

వాస్తు జాతకాది శాస్త్రంబులను నమ్మి
మదిని కలత పడకు మంచి కొరకు
బ్రహ్మ తరమె నడ్డ, ప్రారబ్ద కర్మలన్?
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **31**

విడిన ధనువు శరము, గడచిన కాలంబు,
నోట జారినట్టి మాట మరల
తిరిగి తీసుకొనగ తరమౌనె నెవరైన?
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **32**

ధర్మమాచరించి, సత్యమున చరించి,
సతము న్యాయ పక్షమతడు నిలిచి,
హింస నుజ్జగించ నిల ధన్యుడతడెగా!
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jul 2010) **33**

సత్యభాషనంబు సరియైన భూషణము
నిజము నెగ్గునెపుడు నిలకడైన
అవని వెలిగె నటులె ఆ హరిశ్చంద్రుడున్
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **34**

భువిని వస్త్ర దాన, భూదాన, గోదాన,
రక్త దాన, నేత్ర దాన మరయు
అన్ని దానములలో అన్న దానమె మిన్న
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **35**

ఏమి లేని ఆకు ఎగిరెగ్రి పడుచుండు
అన్ని ఉన్న ఆకు అణిగియుండు
నుర్వి దుర్జ, సజ్జనుండ్రు మెలుగు నిట్లు
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **36**

వస్తువెంతదైన వైశిష్ట్యమనుదుండు
దేని విలువ జూడ దానికుండు (పెద్ద చిన్న దన్న భేదమేల)
సూది జేయు పనిని శూలంబు జేయునా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **37**

దుర్జనుండు యుక్తి సుజనుడై చరియింప
గుర్తుపట్టవచ్చు గుణము చేత
ఇత్తడెంత మెరియ పుత్తడై పోవునా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **38**

కలిమిలేములందు, కష్టసుఖములందు,
సంతసంబు, దుఃఖసమయమందు,
ఎల్లవేళలందు ఒల్లు నతడె సఖుడు
నిశ్చయంబుగాను నిముషదేవి

(6 Jul 2010) **39**

దుష్టవానికెపుడు దూరమై చరియించు
నష్టమైన ధనము నతని విడువు
పాలు బోసి పెంచ పాము కాటేయదా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(7 Jul 2010) **40**

భయము, భక్తి లోన భక్తి మహోన్నత
మదియు నెట్లు యనగ, మహిని కనగ
భయము వల్ల కాని పనులు భక్తి నగును
నిశ్చయంబుగాను నిముషదేవి

(7 Jul 2010) **41**

ఆస్తి కొరకు జూసి ఆరోగ్యమును వీడ
కలిమి పెరుగు గాని కలత విడదు
భాగ్యమన్న నదియునారోగ్యమే జూడ
నిశ్చయంబుగాను నిముషదేవి

(17 Jun 2018) **42**

అన్ని వేళలందు ఆనందముగనుండు
కుములు మదిన వ్యాధి కుల్లు చుండు
సంతసంబె మనిషి సగబలంబని యెంచు
నిశ్చయంబుగాను నిముషదేవి

(7 Jul 2010) **43**

ఆరు నూరు యైన అత్త తల్లి యవదు
కోడలవదు బిడ్డ, కోటియైన
నేటి కొడలమ్మె రేపటికత్తగా
నిశ్చయంబుగాను నిముషదేవి

(7 Jul 2010) **44**

వెయ్యి ఏళ్ళుయైన వేరుగాక మనరు
విడదు చావు వంద ఏళ్ళకైన
బతికి యున్న నాళ్ళె భవపాశ బంధాలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(7 Jul 2010) **45**

చిన్న వయసు నుండె పిల్లలన్ క్రమమైన
మార్గమందు నడుచు నటుల జేయు
మ్రొక్క వంగకున్న నొంగునా మానైన?
నిశ్చయంబుగాను నిముషదేవి

(22 Jul 2010) **46**

బ్రతికియున్న నాళ్ళు పట్టెడన్నమిడక
చావ, తద్దినాలు చాల సలుప
పుత్రుడెట్లు పొందు పుడమిలో సద్గతుల్
నిశ్చయంబుగాను నిముషదేవి

(22 Jul 2010) **47**

కోపంమణుచు బుద్ధి, కోపంబు శత్రువు
శాంత గుణము రక్ష, సఖుడు దయయు
నాకమవని సుఖము, నరకంబు దుఃఖము
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **48**

అప్పు చేసి కుడుచు పప్పు కూడిల కంటె
కష్ట పడుచు త్రాగు గంజి మేలు
పరుల సొమ్ము పాము, పాపిష్టి ధనమెంచు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **49**

దైవ భక్తి కలిగి, దేవాలయములేగి
నిత్య పూజ విడక, సత్య మదిని
భూత దయను కలుగ, ముక్తి పొందు నరుడు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **50**

విలువ పెంచు ఖలుని, విజ్ఞసాంగత్యంబు
నదియు నెట్లు యనగ నవని, తావి
చందనమును కోయు అంపంబు కద్దుగా
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **51**

ఆకలనుచు వచ్చు ఆర్తుడరియునైన
పట్టెడన్న మోసగ పుట్టు ప్రగతి
దప్పికనెడి వాని దాహంబు దీర్చినా
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **52**

మనిషి జన్మ పరుల మంచి చేయు కొరకె
మేలు జేయకున్న కీడు మాను
తోచు సాయ మోసగు తోటి వారల కెప్డు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **53**

ఇంటి లక్ష్మి యౌచు ఇల్లాలు వెలుగంగ
పడతి పసుపుకుంకుమలతొ మురియ
అష్ట సిరులు కురియు నట్టింట సతము
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **54**

ముదము గొల్పు నింటి ముంగిట ముత్యాల
ముగ్గు లిడగ, కలికి నరుగు లలక
సిరియు నడుగు లిడుచు చిరునవ్వుతో తాను
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **55**

ఇంటి జూచి గాని ఇల్లాలిని జూడు
నగలు గావు పడతి నగవు జూడు
సొగసు కాదు సుదతి సౌశీల్యమును జూడు
నిశ్చయంబుగాను నిముషదేవి

(2 Jan 2011) **56**

సజ్జనుండు బల్కు శాంతంబుగా నెప్ప
దుర్జనుండు బల్కు దురుసు గాను
మాట మనిషి మర్మంబు దెలుపుగా
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jan 2011) **57**

ఆది తప్పబోకు ఆటంకమెదురైన
పెదవి త్రిప్పబోకు చేటుయైన
వాక్కుచేత మనిషి వాసిగాంచు జగతి
నిశ్చయంబుగాను నిముషదేవి

(3 Jan 2011) **58**

తనదు పుణ్య ఫలము తాళికట్టెడి భర్త
ఇంతి దాన ఫలమె సంతు యనెడి
మాటలెరిగి మసులు మగువ బ్రతుకు మేలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(4 Jan 2011) **59**

మనసు మెచ్చు మగడు మగువ నోము ఫలము
దాన ఫలమె సంతు ధాత్రి స్త్రీకి
జన్మ సార్థకంబు, జగతి పడతికిట్లు
నిశ్చయంబుగాను నిముషదేవి

(4 Jan 2011) **60**

అమ్మ, అక్క, చెల్లి, ఆలి రూపంబుల
ప్రేమ పెంచి, పంచ స్వీకరించి
కూతురంటు జంప పురిటిలో న్యాయమా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **61**

చూడ వెలుగు నిచ్చు సూర్యుండు పగటిలో
చంద్రుడిచ్చు నిశిని చల్లదనము
ప్రజల కవని వీరె ప్రత్యక్ష దైవాలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **62**

పేరు నక్షరముల మార్పు జేసికొనగ,
రంగు రాళ్ల బెట్టు నుంగరముల
జాతకమున మార్పు జరుగునా కలనైన?
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **63**

కష్ట పడక రాదు కాసైన వసుధన
చెమట చిందకున్న సిరి కలుగున?
సులువుగొచ్చు కలిమి సుంతైన మిగులునా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **64**

కాలమహిమ, విలువ కాలంపు ఘనకీర్తి
పాగడ తరమె? జనులు పుడమిలోన
కాల మదియె జేయు గాయంబులను మాన్పు
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **65**

పుణ్యతీర్థములను ముమ్మారు మునకేయ
దేవలంబులేగ, దాన మిడగ,
చెరగు ననుట కల్ల చేసిన పాపంబు
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **66**

కన్ను తెరవకున్న ఎన్నెన్నో దేశాలు
వసుధ భారత భూమి పరిఢవిల్లె
అట్టి భరత మందు బుట్ట ధన్యమె జన్మ
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 May 2018) **67**

భోగి గాని వాడు యోగి గానేరడు
కామి గాక మోక్షగామి కాడు
వైద్యుడన్న వాడు ఒకనైన జంపడా?
నిశ్చయంబుగాను నిమిషదేవి

(9 May 2018) **68**

విద్య లేను వాడు వింత పశువు జోడు
గురువు లేని విద్య గుడ్డి విద్య
వినయమసలు లేని విద్య వ్యర్థంబుగా
నిశ్చయంబుగాను నిమిషదేవి

(9 May 2018) **69**

సకల కళల తల్లి సంగీత సాహిత్య
భరిత సంస్కృతి గల భారత మాత
పుణ్యమెంతొ గొంటి పుట్టినీ గడ్డపై
నిశ్చయంబుగాను నిమిషదేవి

(9 May 2018) **70**

ధర్మమార్గ మెరిగి నర్థంబు నార్జించి
కామితముల బడయ కామ మెరిగి
మోక్ష మదియె గల్గు సూక్ష్ముగ పరికింప
నిశ్చయంబుగాను నిమిషదేవి

(16 May 2018) **71**

తాపమగ్ని సముము కోపమావేశంబు
తనను గాల్చు మొదలి తరుల కన్న
దయయు, శాంత గుణము ధరమంచు సమమెర్గు
నిశ్చయంబుగాను నిముషదేవి

(16 May 2018) **72**

అందమన్నదరయ వదనంబునది గాదు
మనసు బట్టె మనిషి మనుగడెరుగు
చక్కదనము యన్న నిక్కంబు నడవడే
నిశ్చయంబుగాను నిముషదేవి

(11 Jun 2018) **73**

పంచుకొద్ది పెరిగి మించు సంతోషంబు
తరుగు దుఃఖ మదియు తరచి జూడ
మనసు తేలికౌను పది మందికిని పంచ
నిశ్చయంబుగాను నిముషదేవి

(12 Jun 2018) **74**

పెంచ పెరుగు తెలివి, మించు మంచి తనము
పెరుగు విద్య పంచ తరగదెపుడు
పంచ పెరుగు గుణములెంచి పెంచుకొనుము
నిశ్చయంబుగాను నిముషదేవి

(12 Jun 2018) **75**

అవనిలోన జూడ ఆనందమును పొందు
పిచ్చివాళ్ళు మరియు పిల్లలంతె
నవ్వుచుండి మెలుగు, నటనలితరులెల్ల
నిశ్చయంబుగాను నిముషదేవి

(30 Jun 2018) **76**

మహిని సకల జనులు మనుషులు ప్రేమించి,
వస్తువులను ప్రీతి వాడుకొనక,
వాడుకొని మనుషుల, వస్తువుల్ ప్రేమింత్రు
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 Jul 2018) **77**

నచ్చినటుల నీకు నిచ్చతీర తినుము
పరులు మెచ్చునటుల తిరుగు భువిని
సంతసంబు కీర్తి సద్గుణంబున గల్గు
నిశ్చయంబుగాను నిముషదేవి

(9 Jul 2018) **78**

కుమతుడన్న వాని కమిత నీతులు దెల్ప
చెడ్డయౌనె గాని దొడ్డ గాదు
కుక్క తోక, ఱాయి కుదురు యౌనా గట్ట?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **79**

మంచికాలమందు మించి సంబరమొంది
కష్టకాలమందు కలత పడక
రెంటి నేక దృష్టి కంట నతడె జ్ఞాని
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **80**

అమృతమౌను విషము అభ్యాసమందునా
వేప వాడుచుండ తీపిగుండు
సాధనమున నీవు సాధించు సకలంబు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **81**

పాత రోత యనుట పనికి మాలిన మాట
క్రొత్తవింతయనుట ఉత్త మాట
పాత మీదె క్రొత్త పూత పూయుట బాట
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **82**

అల్పుకొసగ నీతులమితంబు శూన్యమే
గుణము మారదసలు అణువుయైన
చెప్పు కరచు కుక్క చెఱుకు తీపెరుగునా?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **83**

అప్పు జేయువాడు తిప్పలన్విడలేడు
ముప్పు జేయువాడు చెప్పి చనడు
తప్పు జేయువాడు ఎప్పటి కొప్పడు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **84**

తోటివానికెపుడు చేటు జేసెడివాడు
సుఖము నొందలేడు సుంతయైన
నరక మేగు చచ్చి నరయగా ధరలోన
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **85**

అల్పుడధికుడన్న అరమరికలవేల?
బీద ధనికుడన్న బేధమేల?
కన్ను మూసినంత కాటికే ఎవరైన
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **86**

కర్మ కొలది సుఖము కష్టమన్నదెరుగు
ఎంత ప్రప్తమన్న నంత కలుగు
నొసటి గీత మార్చ వసుధలో తరమౌనె?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **87**

బంధమేదియైన, మాట, వాగ్దానంబు,
నమ్మకంబు, మనసు, నవనిలోన
విరిగి, తప్పినంత తిరిగి అతకలేము
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **88**

పడ్డవాడు ఎపుడు చెడ్డవాడే కాడు
తొందరంబు తోడ నోర జార
తిరిగి తీసుకొనగ తరమె నెవరికైన
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **89**

వేగమెపుడు వలదు ఏ పరిస్థితిలోన
నిలకడదియె గెల్చు నిలను దెల్పు
తరచి జూడ కథను, తాబేలు కుందేలు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **90**

ఆత్మ గౌరవంబు అసలైన భూషణము
అనువు చోట జూపు మవధి నెఱిగి
హద్దు దాటనది నహంభావమై గూల్చు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **91**

కడుపు చూచునెపుడు కన్న తల్లి తనదు
భార్య జేబునున్న బరువు జూచు
ఆలి ఆలెగాని అమ్మగానేరదు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **92**

కోరలందు విషము జేర జిమ్మును పాము
తెలుకొండి యందె కలదు విషము
ఖలుని బట్టి జూడ నిలువెల్ల విషముండు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **93**

అల్పుడధికుడొక్క ఆకారమున యున్న
గుట్టు నెఱుగ వచ్చు గుణము చేత
హంస కొంగ లందు హంస నెఱుగ లేమె?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **94**

పాట్ట కొఱకె కోటి పోకడల పనులు
పరితపించుటెల్ల బట్ట కొఱకె
వీటి మరచి మనిషి కోట్ల కాశది యేల?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **95**

మతము కన్న గొప్ప మానవత్వ మెరుగు
కులము కన్న మనిషి గుణము గొప్ప
మంచి మనసు యున్న మనుజుడే దేవుడౌ
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **96**

ధనము మనిషిలోని హీన గుణము బెంచు
కాసు చిత్త శాంతి కరువు జేయు
ధనమె మానవుడిని దానవునిగ మార్చు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **97**

ధనము గల్గెనేని దాసోహమనునెల్ల
కాసు తప్పు జేయ కప్పి పుచ్చు
ధనమె సకల మూలమనెఱుగు భువిలోన
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **98**

సజ్జనుండు కుజన సహవాస మొనరించ
దొడ్డయనరు వాని చెడ్డయంద్రు
తాటి క్రింద పాలు త్రాగినా కల్లంద్రు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **99**

కీడు జేయువానికీను మేలును జేసి
బ్రతుకు సజ్జనుండు పరుల కొఱకె
రాళ్ళు రవ్వ పండ్లు రాల్చు తరువు రీతి
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **100**

ఆకలెఱుగదు రుచి, గంజి మేలనిపించు
నేల కటిక పైన నిద్ర రాదె?
అవసరాలు పొంద ఆర్భాటు మదియేల?
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **101**

ధనము హెచ్చ డాబు దర్పంబు పెరుగును
మనిషి మాట తీరు మారు బుద్ధి
మానవత్వ మెరిగి మసలు నాడె ఖ్యాతి
నిశ్చయంబుగాను నిముషదేవి

(?? ??? 2018) **102**

స్వార్థబుద్ధి వీడి సామరస్యము తోడ
సకల జనుల క్షేమ సంస్కరణకు
పూనుకొనిన రాజె పుడమిలో రారాజు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **103**

గాలి, నీరు, నిప్పు, గగనంబు, భూమియూ
నేక దృష్టి జూడ సకల జనుల
మనిషిలోనె స్వార్థ మమకారములు గాంచ
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **104**

మౌనమోర్పులనెడి ఘనమైన గుణములు
భావమందు మరియు మనసునుండ
ధైర్యవంతు జేయు ధరణిలో గమనించు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **105**

ఎదుట మెచ్చువారె నిజమైన నీ వారు
యనుచు భ్రాంతి పడకు వెనుక జేరి
తిట్టుకొంద్రు నిన్ను వట్టిమాటిదికాదు
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **106**

అనుభవించు నీదు ఆనంద జీవితం
బరుల పోల్చు మిగులశాంతి, కలత
నీదు రీతి బ్రతుక నిజమైన సుఖమదే
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **107**

విఫలమెంచి పనిని విడువకు తోలియందె
పట్టుదలను విడక గట్టి కృషిన
జయమునొందవచ్చు జగతిలో పూనికన
నిశ్చయంబుగాను నిముషదేవి

(? ??? 2018) **108**

ఇతి శ్రీ నిమిషాంబికా దేవి శతకము సంపూర్ణం

మంగళ హారతులు

అమరకంఠ పురాన జానుమండలుడను
అసురుడు అమరుల బాధింపగా
శ్రీముక్తఋషి సదాశివమండమపం బెదుట
విశ్వమిత్రుతో సవన వనమునందు ‖ మంగళం మంగళం‖
‖ నిమిషాంబా మంగళం మంగళం‖

అగ్నిహోత్రము నెఱపి ఆది శక్తీ నీకై
యాగంబు పౌండరీకంబును జేయ
నిమిష మాత్రంబున దశదిశల్ కంపింప
అగ్నిలో బుట్టిన నిమిషాంబ నీకిపుడు ‖ మంగళం మంగళం‖

శశి నుండి బిందువును శిశువుగ జేసియు
శశిబిందు పేరిడియు ఋషికి నిచ్చి
ఆర్తులను బ్రోచిన హైమవతి గౌరీ
అనిశంబు గొల్తుము ఆర్యా మహాదేవి ‖ మంగళం మంగళం‖

కంచి కామాక్షి వై మధుర మీనాక్షి వై
కాశీ విశాలాక్షి కాపాడగా
మూకాంబ జ్ఞానాంబ భ్రమరాంబ రూపాల
ముద్దు గొల్పెడి మా నిమిషాంబ నీకిపుడు ‖ మంగళం మంగళం‖

నీమముతో నిన్ను వేమారు వేడిన
సోమ వంశపు ఆర్య క్షత్రియుల నెల్ల
కామితార్థము లిచ్చి కరుణించు కళ్యాణి
క్షేమంబు లొనగూర్చు కాత్యాయనీ కాళీ ‖ మంగళం మంగళం‖

పండిత శ్రీ ఇనుగండ్ల వేంకటేశ్వర వర్మ

ఓం నిమిషాంబ గౌరీ, అంబ జగదంబా గౌరీ

భక్తీ భావమున స్మరియింతురు నిను,² బ్రహ్మా హరి శివులు ‖ ఓం ‖ (౧)
సవన వనంబున విశ్వామిత్రుతొ, సన్ముని ముక్త ఋషీ ‖ అంబ ‖
పొండరీక యాగం బొనరించగ,² ప్రత్యక్షంబైన ‖ ఓం ‖ (౨)
శశిబిందువును శిశువుగ జేసి, శశిబిందను పేరా ‖ అంబ ‖
దనుజుల దునుమగ ముక్తునికొసగిన,² దాక్షాయణి దుర్గా ‖ ఓం ‖ (౩)
కజ్జలయుత నయన ద్వయ మధ్యన, కస్తూరి తిలకమునా ‖ అంబ ‖
పాపట సింధూరము రాజిల్లగ,² ప్రజ్వరిల్లు వదనా ‖ ఓం ‖ (౪)
మాల కంఠమున మిలమిల మెరయగ, మేటి రత్నములతో ‖ అంబ ‖
రక్త వర్ణ సుమ మాలా,² రంజిల కంఠమున ‖ ఓం ‖ (౫)
అక్షిత్రయంబులు అతిశయింపగా, అరుణాంబరములతో ‖ అంబ ‖
అధివసించితివి శ్రీ చక్రంబున,² ఆర్య మహాదేవి ‖ ఓం ‖ (౬)
వాణివి నీవే రుద్రాణివి నీవే, వైష్ణవి దేవీవే ‖ అంబ ‖
సకల జగాలకు మాతావు నీవే,² సద్గతి నీవేగా ‖ ఓం ‖ (౭)
శర్వాణి భువనేశ్వరి ఈశ్వరి, శోణిత బీజహరీ ‖ అంబ ‖
శరణము నొసగవె శైలకుమారీ,² శంఖ చక్రధారి ‖ ఓం ‖ (౮)
జానుమండల నాశకారిణీ | జగజ్జనని గౌరీ | ‖ అంబ ‖
సుర నర ముని జన సేవిత|² శూలాంకుశ ధారీ ‖ ఓం ‖ (౯)
కరకంకణములు చరణ కింకిణులు | కర్ణ కుండలములు | ‖ అంబ ‖
ధరియించితివి ముత్యపు ముక్కెఱ|² ధనుర్బాణధారీ ‖ ఓం ‖ (౧౦)
కేదారేశ్వరి రాజరాజేశ్వరి | కైవల్యము నీవే | ‖ అంబ ‖
కళ్యాణీ ఘన కేసరి వాహిని|² ఖడ్గ వర్మ ధారీ ‖ ఓం ‖ (౧౧)
అష్టభుజమ్ములు అతిశోభిల్లగ | ఆయుధములు దాల్చీ | ‖ అంబ ‖
కోలిన కోర్కెలు సఫలము జేయవె|² కాత్యాయని కాళీ ‖ ఓం ‖ (౧౨)
యోగిను లరువది నలుగురు పాడగ | అష్టభైరవాడ | ‖ అంబ ‖
గాన వాద్య శ్రుతిలయలకు|² గణపతి నర్తించా ‖ ఓం ‖ (౧౩)
సర్వ సుమంగళి సుమధుర భాషిని | సుహాసినివి నీవే | ‖ అంబ ‖
మంగళ గౌరివి నీవే|² మంగళముల నీవే ‖ ఓం ‖ (౧౪)
ఆగమ నిగమ అంతర్యామివి | అంబాత్రయమీవే | ‖ అంబ ‖
అమరకంఠపుర పీఠాధీశ్వరి|² హారతి గైకొనవే ‖ ఓం ‖ (౧౫)
నిమిషాంబా దేవీ నీ హారతి | నిరతము కీర్తించా | ‖ అంబ ‖
సోమవంశ ఆర్య క్షత్రియులకు|² సుఖ సంపద లీవే ‖ ఓం ‖ (౧౬)

శ్రీ ఇనుగండ్ల శ్రీధర్ వర్మ
19 May 1986 - ప్రమాది వైశాఖ శుద్ధ దశమి